# మానవతే మనిషికులం

తమిరిశ జానకి

"ఒరేయ్ గోపీ..." కోపంతో సుశీలమ్మ కేకేసింది కొడుకుని.

"ఏవిటమ్మా?" వెంటనే వంటింట్లో కొచ్చాడు గోపీ.

"ఆ పిల్లాడినలా అన్ని గదుల్లోనూ తిప్పుతావేవిట్రా? బయటే కూచో పెట్టు. అసలైనా వాడితో నీకు స్నేహం ఏమిటి? ఎందుకలా వాడితో పూసుకు తిరుగుతావు?"

"రాము నా క్లాస్ మేట్ అమ్మా..."

"అయితే ఏవిటి? వాళ్ళ కులం ఏవిటో నీకు తెలియదుగానీ నాకు తెల్సు. అలా ఎవడిని పడితే వాడిని ఇంట్లోకి తీసుకురాకు."

"ఎందుకూ?" భయం భయంగా తల్లివంక చూస్తూ అడిగాడు.

"వాళ్ళని మనం ముట్టుకోకూడదు. మనది పెద్దకులం. వాళ్ళది చిన్నకులం." విసుగ్గా జవాబు చెప్పిదేవుడి దగ్గర పూజకి కూచుంది సుశీలమ్మ. వరసగా స్తోత్రాలు, శ్లోకాలు చదువుతు పోతూ అరగంటసేపు చేసింది పూజ. ఆఖర్న చదివింది ఈ శ్లోకం "మిత్రస్య మాచక్షుషా సర్వాణి భూతాని సమీక్షన్తే, మిత్రస్య చక్షుషా సమీక్షా మహే" (అన్ని భూతములు నన్ను ప్రేమతో చూచుగాక, మిత్ర దృష్టితో మేము ఒకరినొకరు చూచుకొందుముగాక!) (అన్ని భూతములు అంటే అన్ని ప్రాణాలు)

తల్లికి భయపడి రామూని వరండాలోనే కూర్చోపెట్టాడు గోపీ.

అమ్మెప్పుడూ కులం కులం అంటుంది... ఈ కులం ఏవిటో మనుషుల మధ్య, వాడి చిన్ని బుర్రకి అంతుపట్టదు.

చిన్నప్పటినించీ మా ఇంటికి రారా అని అడుగుతుంటే, పాపం ఇన్నాళ్ళకి ఇవాళ వచ్చాడు రాము. వాడికి ఇల్లంతా చూపించాలని, ముఖ్యంగా తను చదువుకునే గది, దాని ఆనుకుని ఉన్న వరండా, అక్కడినించి కనిపించే గోదావరి, అమ్మవారిగుడి అన్నీ వాడికి చూపించాలని తనెంతో సరదా పడుతుంటే, అమ్మేమో వాడిని ఇంట్లోకే తీసుకు రావద్దంటోంది... వాడి వయసూ తనవయసూ ఒకటే. వాడు పదివేదీ తను పదివేదీ ఒకటే క్లాసు. అన్నిట్లోనూ తనకంటే వాడికే ఎక్కువమార్కు లొస్తాయి. క్లాసంతటికీ ఫస్టుమార్కు వాడిదే. వాడంటే తనకెంతో ఇష్టం. తనంటే వాడికీ చాలా ఇష్టం. ఎంతోమంచివాడు... అలాంటి వాడిని ఇంట్లోకి తీసుకొస్తే అమ్మకెందుకో అంతకోపం!... అర్థం కాలేదు గోపీకి.

ఆ రాత్రి మరి ఉండబట్టలేక, మెల్లిగా తన సందేహం బయటపెట్టాడు తల్లిదగ్గర "కులం అంటే ఏవిటమ్మా?"

"కులం అంటే... కులం అంటే..." ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలియలేదు సుశీలమ్మకి.

"బ్రాహ్మలు, క్షత్రియులు, వైశ్యులు ఇలా చాలా ఉన్నాయి కులాలు" అంది ఓ నిమిషమాగి. వాడడిగిన ప్రశ్నకి, అది సరియైన సమాధానం కాదని తెల్సి కూడా.

"అయితే ఎవరెవరు ఏం కులమో ఎలా నిర్ణయిస్తారు?"

ఈసారి కొడుకు అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడం తేలికేనని పించింది ఆవిడకి.

తను ఉద్యోగం చేస్తున్న "ఆ చిన్న ప్రైవేట్ కంపెనీ" దివాలా తీయడంతో ఉన్న ఉద్యోగం ఊడిపోయి, మరో ఉద్యోగం దొరక్క, కొంతడబ్బు అప్పు తీసుకుని ఫ్యాన్సీ షాపొకటి తెరిచాడు గోపీ తండ్రి శేషగిరి, ఏదో భుక్తికి లోటు లేకుండా కుటుంబం నెట్టుకొస్తున్నాడు.

ఆ రోజు హైదరాబాద్ నించి తమ్ముడి దగ్గర్నించి వచ్చింది ఉత్తరం.

**తను ఉద్యోగం చేస్తున్న ఆ చిన్న ప్రైవేట్ కంపెనీ దివాలా తీయడంతో ఉన్న ఉద్యోగం ఊడిపోయి, మరో ఉద్యోగం దొరక్క, కొంత డబ్బు అప్పుతీసుకుని ఏదో భుక్తికి లోటు లేకుండాఫ్యాన్సీషాపొకటితెరిచాడు గోపీ తండ్రి శేషగిరి.**

"ఏం రాశాడు మీ తమ్ముడు?" అడిగింది సుశీలమ్మ.

"ఏ వుందీ? ఏదో కాస్త ప్రయోజకుడైనట్టే కనిపిస్తున్నాడు. కాస్త బరువు బాధ్యతలు తెలిసొచ్చాయి. ఇన్నాళ్ళూ బలాదూరుగా తిరిగినా, ఇప్పుడు కాస్త, తన కాళ్ళమీద తను నిలబడుతున్నాడు..."

"అసలు విషయం ఏమిటీ?"

"ఇంకో ఫ్రెండుతో కల్సి డ్రైక్లీనింగ్ షాపొకటి పెడుతున్నాడట..."

"ఏవిటీ? లాండ్రీ షాపా? ..." ఈసడింపుగా అంది.

"డ్రైక్లీనింగ్ షాపంటే అంత తీసిపడేస్తున్నావేవిటే? సిటీలో బోలెడొస్తుంది. డ్రైక్లీనింగ్ షాపు పెట్టుకుంటే... తిండికి ఇంకోళ్ళ మీద ఆధారపడకుండా ఇన్నాళ్ళకి నిలకడగా వాడబతుకు వాడు బతుకుతానంటే సంతోషించక అలా అంటావేమిటి?"

"మరింకే మనమంటారు?"

"చదువసలు వొంటపట్టలేదు వాడికి. టెన్త్‌క్లాస్‌తో ఆపేశాడు. ఇంకా చదువుకోరా అంటే ఇంట్రస్టులేదనేశాడు. అయినా, ఈ రోజుల్లో చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు రెడీగా ఉన్నాయా? ప్రతివాడూ డిగ్రీలు తెచ్చేసుకుని గవర్నమెంట్ మాకు ఉద్యోగాలు చూపించాలి లేకపోతే మేము చస్తులే అంటూ గడ్డాలు పెంచేసి క్యూలో నిలబడితే నిరుద్యోగి అన్న ముద్ర పడుతుంది తప్ప ఫలితం ఏవుంది? ఏదో... ఎవడికివాడు ఏదో ఉపాధి కల్పించుకుని తన భారం ఇంకోడి మీద లేకుండా చూసుకోవాలంతే."

అమ్మా, నాన్నలమాటలు... ఆ గదిలోనే ఉన్న గోపీ చెవుల్లో పడుతూనే ఉన్నాయి. అందులోకొన్ని అర్థమవుతున్నాయి, కొన్ని అర్థం కావట్లేదు వాడికి.

* * *

"అమ్మా! నేను కాసేపు రవీ వాళ్ళింటికెళ్ళి ఆడుకుని వొస్తానమ్మా!" అడిగాడు గోపీ. రవీ వాళ్ళు కుక్క పిల్లని పెంచుతున్నారు. ఈ మధ్యే తీసుకొచ్చారు. ఎంతో ముద్దొస్తూ చాలా బావుందనీ చూడటానికి రమ్మనీ రవి రోజూ స్కూల్లో మరీమరీ చెప్తూ ఉండడంతో దాన్ని చూడాలని మనసు పీకుతోంది గోపీకి.

"ఏవిటి? రవీ వాళ్ళింటికా? బుద్ధిలేదేమిట్రా నీకు?"

అమ్మ కసిరిన కసురుకి చిక్కమొహం వేశాడు.

"రవీ వాళ్ళింటికెళ్ళి ఆడుకుంటానంటే బుద్ధిలేదా అంటావేమిటి?" ఆశ్చర్యంగా చూశాడు శేషగిరి.

"బావుందీ... వాళ్ళింటి కెళ్ళడమేమిటీ? మీకు మటుకూ తెలియదా, ఆ రవి వాళ్ళమ్మదో కులం, నాన్నదో కులం... అలాంటి పెళ్ళిళ్ళు చేసుకున్న వాళ్ళ ఇళ్ళకి మన పిల్లాడిని పంపుతామా?"

"అబ్బబ్బ!... నీ కులాలూ, మతాలూ గొడవల్తో వాడి తలబొప్పికట్టిస్తావు నువ్వెప్పుడూ..."

"కుందు దొరికితేచాలు నన్నుదుయ్య పట్టడమే మీ పని. నేనంటేనే విసుగుమీకు. అలాంటి వాళ్ళు పెళ్ళెందుకు చేసుకున్నారసలు..."

"చాలు... ప్రతిరోజూ మాటకి ముందు ఈ పాటొకటి పాడతావు..."



"అనండి. అనండి. మీరెంత విసుక్కున్నా వచ్చినట్టు మీ కాళ్ళ దగ్గరే పడుంటానని ధైర్యం మీకు."

"ఇప్పుడు నేను అనకూడని మాటలేమన్నానని?"

"హూ! అన్నీ అనేసి ఏమన్నానూ అంటూ సాగదీస్తారు. మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు."

"ఏం! నా బుద్ధికే మొచ్చిందిప్పుడు?" చిలికి చిలికి గాలివానైంది వాళ్ళ వాదన. చెవులు గట్టిగా మూసుకుని బయట వరండాలో కొచ్చేశాడు గోపీ. ప్రతిరోజూ కూడా ఏదో ఒక విషయమ్మీద తప్పకుండా దెబ్బలాడుకుంటూ ఉండే అమ్మా, నాన్నల్ని చూస్తుంటే ఓ పెద్ద సందేహం వచ్చింది వాడికి. అందరి అమ్మా, నాన్నలూ రోజూ ఇలాగే దెబ్బలాడుకుంటూ ఉంటారా?..."

* * *

రవి మరీ మరీ అడగటంతో, ఆ రోజు స్కూల్నుంచి ఇంటి కొచ్చేటప్పుడు రవి వాళ్ళింటికి వాడితో కల్సి

వెళ్ళాడు గోపీ. నిజంగానే కుక్కపిల్ల ముద్దుగా ఉంది. కుయ్యి కుయ్యి మంటూ గోపీ కాళ్ళ దగ్గర కొచ్చింది. కాసేపు ఇద్దరూ దాంతో ఆడుకున్నాక "చేతులు కడుక్కురండి. టిఫిన్ పెడతాను" అంటూ కేకేసింది రవీ వాళ్ళమ్మ.

"నేనింక ఇంటికెళ్తాను ఆంటీ..." చిన్నగా నసిగాడు గోపీ.

"వెళ్తువుగాని బాబూ. రవితో కల్సి టిఫిన్ తిందువుగాని రా..." ప్రేమగా ఆంటీ పిలుస్తుంటే కాదనలేకపోయాడు. ఇంతలో రవీ వాళ్ళనాన్న వొచ్చాడు. రవిని దగ్గరికి తీసుకుని మృదువుగా అడిగాడు "నీ ఫ్రెండా ఇతను? పేరేమిటి?"

చెప్పాడు రవి స్నేహితుడి పేరు, "వెరీగుడ్ నీ ఫ్రెండుకి మనిల్లు చూపించావా? కుక్కపిల్లని చూపించావా? మీ అమ్మచేసిన బొమ్మలు కూడా చూపించు నీ ఫ్రెండుకి."

"చాల్లెండి... నేను చేసిన బొమ్మలు కళాఖండాలా ఏవన్నానా?" సిగ్గుపడుతూ నవ్వింది రవీ వాళ్ళమ్మ.

"ఏమో... మహా మహా కళాఖాండాలకంటే, మాకు, నువ్వు చేసిన బొమ్మలే ఎక్కువ.... అపురూపం... ఆ.. ఇవాళేమిటి టిఫిన్?"

"పొద్దున్న వెళ్ళేటప్పుడే చెప్పి వెళ్ళారుగా, ఇవాళ పకోడీలు వెయ్యమని."

ఆంటీ మృదువుగా మాట్లాడుతుంటే అలాగే వింటూ ఉండాలనిపించింది గోపీకి.

"ఓ... పకోడీలు చేశావన్నమాట... గుడ్... రండి పిల్లలూ వేడి వేడి పకోడీలు తిందాం."

పిల్లలిద్దరూ సబ్బుతో చేతులు రుద్దుకుని వొచ్చారు. డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లలో సర్దిన పకోడీలు నోరూరిస్తున్నాయి.

గోపీకి పక్కకుర్చీలో కూర్చుంది రవీ వాళ్ళమ్మ.

అంకుల్ నవ్విస్తూ కబుర్లు చెప్తుంటే, మరి కొంచెం వేసుకోమని ఆప్యాయంగా ఆంటీ అందరి ప్లేట్లలోనూ మళ్ళీ మళ్ళీ పకోడీలు వేస్తుంటే ఆ వాతావరణంలో మరెంతో రుచిగా అనిపించాయి పకోడీలు గోపీకి.

"నాదే కులమో అడక్కుండానే మీ అమ్మ నన్ను మీ భోజనాల గదిలోకి రానిచ్చేసిందేమిట్రా" డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చాక, చాలా మెల్లిగా స్నేహితుడివి అడిగాడు గోపీ.

"కులమా? అంటే?"

"కులం అంటే తెలియదా?"

"ఉహూ. తెలియదు."

"మీ అమ్మెప్పుడూ నీతో అనదా? నిజంగా తెలియదా నీకు?"

"ఉహూ. తెలియదు నిజంగానే..."

ఇది చాలా ఆశ్చర్యంగా అనిపించింది గోపీకి.

"ఏరా గోపీ... కాసేపు క్యారమ్స్ ఆడదామా?" చాప తెచ్చివేస్తూ అడిగాడు రవి "ఓ. ఆడదాం.."

ఆంటీ, అంకుల్ కూడా వొచ్చి కూర్చునేసరికి వింతగా చూశాడు గోపీ.

"నువ్వూ నేనూ ఓ పార్టీ, ఏం గోపీ సరేనా?" ఆంటీ తన ఎదురుగా కూర్చునేసరికి చాలా సరదాగా అనిపించింది గోపీకి, ఆట తనకంతగా రాకపోయినా కూడా, ఎంతో ఉత్సాహంగా ఆడాడు, వాళ్ళింట్లో ఉన్నంత సేపూ కాలం తెలియకుండా ఒక నిమిషంలా గడిచిపోయింది.

ఇంటికొచ్చేటప్పటికి ఇంట్లో వాతావరణం మామూలే. ఏదో విషయమ్మీద హోరా హోరీ దెబ్బలాడేసు కుంటున్నారు అమ్మా, నాన్నా.

కొడుకుని చూడగానే కస్సుమంటూ ఇటు తిరిగింది సుశీలమ్మ.

"ఎక్కడికెళ్ళొస్తున్నావురా?"

"రవీ వాళ్ళింటికి" అబద్ధం చెప్పే అలవాటు లేదు గోపీకి. అబద్ధం చెప్పడం చాలా తప్పని వాడికి మేష్టారు స్కూల్లో చెప్పారు.

"ఎంత పొగరానీకు? వాళ్ళింటికి వెళ్ళకూడదని చెప్పానాలేదా? ఎందుకెళ్ళావు అలాంటి వాళ్ళింటికి?"

"అలాంటి వాళ్ళు అలాంటి వాళ్ళు అంటావుగాని నువ్వెప్పుడూ.... వాళ్ళు చాలా మంచివాళ్ళే అమ్మా" భయం భయంగా అమ్మ కళ్ళల్లోకి చూస్తూ తన మనసులో మాట చెప్పేశాడు.

"ఆహాహా... ఈయనగారొచ్చి వాళ్ళ మంచితనానికి సర్టిఫికెట్టు ఇస్తున్నాడయ్యా.... ఏం చూశావు వాళ్ళమంచితనం... ఆవిడదో కులం, ఆయనదో కులం..." అదేదో మహాపరాధం అయినట్టు మూతి తిప్పుకుంది సుశీలమ్మ.

"ఏమో బాబూ వాళ్ళే కులమోనాకు తెలీయదుగానీ.... చాలా మంచివాళ్ళమ్మా వాళ్ళు.... రవినెంత ప్రేమగా చూసుకుంటారో అంత ప్రేమగానూ నాతో మాట్లాడారమ్మా... వాళ్ళిద్దరూ అసలెప్పుడూ దెబ్బలాడుకోరట నువ్వూ, నాన్నగారూ దెబ్బలాడుకున్నట్టు.... రవి చెప్పాడు..."

అవాక్కయిపోయి వింటున్నాడు శేషగిరి కొడుకు మాటలు.... ఆ చిన్నారి హృదయంలో ఎన్నాళ్ళగానో దాగిన భావాల్ని ఇప్పుడు ఆకళింపు చేసుకుంటున్నాడు... ప్రతిరోజూ తనూ, సుశీలా ఏదో ఒక విషయమ్మీద గొడవ పడుతూ ఉండడం ఈ చిన్న మనసులో ఎంత కలత రేపుతోందో ఇప్పుడర్థమైంది అతనికి.... తమ ఇద్దరికీ కూడా కోపం ఎక్కువ.... ఆవేశం ఎక్కువ... ఆలోచన తక్కువ....

గబగబా చెప్పకు పోతున్నాడు గోపీ "రవితో వాళ్ళమ్మా నాన్నా క్యారమ్స్ ఆడతారు... రింగ్ ఆడతారు... వాడి స్నేహితులు ఎవరొచ్చినా ఇంటికి, లోపలికి పిలుస్తారు. చక్కగా మాట్లాడతారు. నీ ఫ్రెండు కులం ఏమిట్రా అని, రవిని లోపలికి పిలిచి రహస్యంగా అడగరట... వీధి వరండాలోనే కూచో పెట్టెయ్యమని, ఇంట్లోపలికి తీసుకురావద్దని అనరట..."

"చాల్లేరా.... ఇంతున్నావోలేదో పేద్ద లెక్చరిస్తున్నావే...."

వాళ్ళు వాళ్ళు చేసే పన్లని బట్టే కులాలని నువ్వేకదమ్మా చెప్పావు. బట్టలుతికే కొట్టే కదా బాబయ్య పెట్టాడు. మరి నాన్నగారేమో ఫ్యాన్సీషాపు — మనదేం కులమప్పుడూ?"

కొడుకు మాటలు మరి వినిపించలేదు సుశీలమ్మకి. నోట్లోంచి మాటే రాకపిచ్చి దానిలా చూసింది. దగ్గరగా వొచ్చి భార్య భుజమ్మీద చెయ్యివేశాడు శేషగిరి. ఉలిక్కిపడి చూసింది. ఇద్దరు చూపులూ కల్సుకున్నాయి. ఆ చూపుల్లో ఎన్నో భావాలు కదలాడాయి.

"రేపు, మీ రవీ వాళ్ళింటికి నన్ను తీసికెళ్ళి వాళ్ళమ్మకి పరిచయం చేస్తావా గోపీ?" గోపీ కళ్ళు ఆనందంతో మెరిశాయి. నమ్మలేనట్టుగా చూశాడు అమ్మ వైపు.

"నువ్వొస్తావామ్మా వాళ్ళింటికి. నన్నే వెళ్ళద్దనావుగా!"

"ఇంకెప్పుడు అననుగా" సంబరంతో అమ్మని చుట్టేశాడు గోపీ, "మా అమ్మ మంచిది" అంటూ.

*



ప్రేమ

"మా డాడీకి మా మమ్మీ అంటే ఎంత ప్రేమో!" గోపీ చెప్పాడు క్రిష్ణకి.

"మా డాడీకి మా మమ్మీ అంటేనే కాదు మా ఎదురింటి ఆంటి అన్నా చాలా ప్రేమే" గొప్పగా చెప్పాడు క్రిష్ణ.

—ఎం.నరసింహారావు (ఏలూరు)

చిలక

